
సాక్షి
బాపట్ల
గురువారం । 26 । జనవరి । 2023



పులిచింతల నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.4733 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు దిగువకు 4,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2,216 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మ మూరు కాల్వకు 1,179 క్యూసెక్కులు వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. ఎక్కడా మరణాలు సంభవించ లేదు.

న్యూస్‌రీల్

నేడు గణతంత్ర వేడుకలు

బాపట్ల: బాపట్ల జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పోలీస్ కవాతు ప్రారంభమవుతుందని చెప్పారు. జాతీయజెండా ఆవిష్కరణ ఉంటుందని వివరించారు. వేడుకల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

సంతమాగులూరు(అద్దంకి రూరల్): విధుల్లో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ సెక్రటరీలకు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు బుధవారం ఎంపీడీఓ సాంబశివరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఏల్చూరు 2, గురిజేపల్లి, కొమ్మాలపాడు, సజ్జాపురం, సంతమాగులూరు 1, వెల్లలచెరువు పంచాయతీ కార్యదర్శులకు.. కుందుర్రు, ఏల్చూరు 1, పాతమాగులూరు వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు పంపించినట్లు తెలిపారు. నోటీసులు అందిన వెంటనే మండల కార్యాలయానికి వచ్చి సంజాయిషీ ఇవ్వాల్సిందిగా ఎంపీడీఓ ఆదేశించారు.

హత్యాయత్నం కేసులో లైన్‌మెన్‌కు ఐదేళ్లు జైలు

బాపట్ల: హత్యాయత్నం కేసులో విద్యుత్ లైన్‌మెన్‌కు ఐదేళ్లు జైలు శిక్ష విధిస్తూ బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సాధుబాబు బుధవారం తీర్పునిచ్చారు. బాపట్ల పట్టణానికి చెందిన లీలా సాంబశివరావు, 2017, ఏప్రిల్ 8వ తేదీన ఒక హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా అదే హోటల్‌కి వచ్చిన లైన్‌మెన్ రమావత్‌సితల్‌నాయక్ దాడి చేశాడు. విద్యుత్ కోతలపై సాంబశివరావు తిడుతుండగా అప్పటి వరకు కత్తితో చెట్లుకొట్టి వచ్చిన లైన్‌మెన్ రమావత్‌సితల్‌నాయక్ ఒక్కసారిగా సాంబశివరావుపై దాడి చేశాడు. తలపై ఒంటిపై బలంగా కొట్టాడు. ఈకేసులో అప్పటి సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కేసును ఏపీపీ చారుమతి, సాక్షులను కోర్టుకు సమర్పించటంతో ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి సాధుబాబు ముద్దాయి నాయక్‌కు ఐదేళ్లు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు.

స్టువర్టు పురం.. అభివృద్ధి వైపు..

అది ఓ పల్లెటూరు. చదువంటే తెలియని గ్రామం. అక్కడ జీవన విధానం ప్రత్యేకం. ఓ కళలో శిక్షణ ఇచ్చేందుకు మాత్రం కేంద్రం ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఊరు వైపు చూడాలంటే భయం. చెన్నై రైల్వే రూట్‌లో వెళ్లేప్పుడు ప్రయాణికులు ఆ గ్రామాన్ని ఇప్పటికి ఆసక్తిగా చూస్తుంటారు. ఆ గ్రామం పేరుతోనే సినిమాలు, కథలు, పుస్తకాలు వచ్చాయి. రోజులు మారాయి. ఏళ్ల తరబడి సంఘ సంస్కర్తల కృషి ఫలితంగా ఆ గ్రామం సంస్కరించబడింది. ఎంతో మంది ఉన్నత విద్యావంతులయ్యారు. అన్ని రంగాల్లో పేరెన్నికగన్న ప్రముఖలకు నిలయమై చరిత్రకెక్కింది. ఆ గ్రామమే స్టువర్టుపురం. 110 ఏళ్ల పూర్తి చేసుకుంది.

– బాపట్ల



గ్రామంలో ఏర్పాటు చేసిన ఏకలవ్యని విగ్రహం



సాగులో ఉన్న పూలతోటలు



స్టువర్టుపురం రైల్వే స్టేషన్

- 110 ఏళ్ల 'పురా'నికి చరిత్రలో ప్రత్యేకత
- సారా కుటీర పరిశ్రమగా ఉన్న గ్రామంలో మార్పునకు నాంది
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకతో చేతివృత్తులకు ప్రోత్సాహం

పూర్వం ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండేవి. దొంగలకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. అయితే 1913లో బాపట్ల ప్రాంతంలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఇంగ్లండ్ దొర మేజర్ మెకర్టీ, వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. విద్య,వైద్యం, ఉపాధి కల్పించేందుకు ఆయన ప్రాధాన్యం చూపాలని కోరగా అప్పటి మద్రాస్ గవర్నర్ స్టువర్టు, మెకర్టీ ప్రతిపాదనకు ఓకే చెప్పారు. అయితే దొంగలను కూడా అదే ప్రాంతంలో ఉంచి పునారావాసం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఇద్దరు తెల్లదొరల మధ్య కుదిరిన ఒప్పందం కారణంగా స్టువర్టుపురం ఏర్పడింది. ప్రభుత్వం మూడు వేల ఎకరాల స్థలాన్ని సాల్వేషన్ ఆర్మీకి అప్పగించింది.

ప్రతి రోజు హాజరు వేయాల్సిందే

అప్పట్లో ఉదయం పూట వ్యవసాయం చేయటంతో పాటు రాత్రి తొమ్మిది గంటలకు ప్రతి దొంగ వచ్చి సంతకం పెట్టాలి. సంతకం పెట్టకపోతే ఆ రోజు రాష్ట్రంలో ఎక్కడ దొంగతనం జరిగినప్పటికీ ఆ నేరం వీరిపై వేసేవారు. దీంతో శిక్ష వేసేందుకు స్థానికంగా జైలును కూడా ఏర్పాటు చేశారు. ఈ విధంగా కాలక్రమేణ దొంగతనాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు.

సాల్వేషన్ ఆర్మీ పేరుతో ఉన్న పొలాలకు 1997లో ప్రభుత్వం వ్యక్తిగత పట్టాలు ఇచ్చి వారికి మరింత చేయూతనిచ్చింది. ఈ పొలాలలో వరి, ఆకుకూరలు, పూలమొక్కలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

విద్యా వ్యాప్తికి కృషి

సాల్వేషన్ ఆర్మీ విద్యావ్యాప్తికి కృషి మొదలుపెట్టింది. 1914లో పాఠశాలకు రూపకల్పన చేసింది. చీరాల, బాపట్ల మధ్యలో హైస్కూలు లేకపోవటంతో పలు గ్రామాలకు చెందిన వారు స్కూలులో చేరారు. ఇక్కడ చదివిన వారిలో ఐఏఎస్ నుంచి జాతీయ కమిషన్ చైర్మన్ హోదా వరకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు చోటు దక్కించుకున్నారు. అయితే కాలానుగుణంగా పాఠశాలల సంఖ్య పెరగటం సాల్వేషన్ ఆర్మీలో ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ లేకపోవటంతో అప్పట్లో 2,500 మంది ఉండే ఈ పాఠశాల ప్రస్తుతం వెదుళ్లపల్లి హైస్కూలులో కలిపేశారు.

ప్రస్తుతం పరిస్థితి ఇలా

స్టువర్టుపురంలో ప్రస్తుతం ప్రశాంతమైన వాతావరణం నెలకొంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో ఉపాధి వైపు పరుగులు తీస్తున్నారు. సారా కుటీర పరిశ్రమగా భావించి కొంతమంది సారా కాసుకుని జీవనం చేసేవారు. తాజా సారా రహిత గ్రామంగా అభివృద్ధి చేసి వారికి వ్యవసాయంపై మక్కువ కలిగించారు. ప్రస్తుతం వ్యవసాయం, పూలతోటల పెంపకం, కూరగాయాలు పండించటం వంటి వాటితో జీవనం సాగిస్తున్నారు.

ఆపరేషన్ స్టువర్టు..

1913లో ఆపరేషన్ స్టువర్టు పేరుతో 200 మంది గజదొంగలపై చేసిన ప్రయోగం చివరికి దేశ చరిత్రలోనే ఓ ప్రత్యేకత సంతరించుకుంది. అప్పటి పాలకుల లక్ష్యానికి ధీటుగా స్టువర్టుపురం ప్రాంత ప్రజలు జీవనాన్ని సాగిస్తున్నారు. వైఎస్సార్ సీపీకి కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతాభివృద్ధికి ఎమ్మెల్యే కోన ప్రత్యేక కృషి చేస్తున్నారు.

ఉన్నత శిఖరాలకు చేరిన వారిలో..

ఐఏఎస్‌లుగా దేవర రాజగోపాల్, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా దేవర సుబ్బారావు, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ గా ఏడుకొండలు, సెల్‌ట్యాక్స్ ఆఫీసర్ దేవర నాగరాజు, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గా చిన్నపోతుల ప్రసాదరావు , సబ్ కలెక్టర్లు బి.ప్రేమకుమారి, సర్ణలత, డివిజనల్ రైల్వే మేనేజర్ గా శర్మరావు, ఎంఈఓగా నిరంజన్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ యూనివర్శిటీలలో అధ్యాపకులుగా చాలా మంది ఉన్నారు.

అభివృద్ధి చేసేందుకు కృషి



స్టువర్టుపురం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ కృషి చేస్తోంది. సమస్యలపై దృష్టి పెట్టాం. ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రత్యేకించి గ్రామాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు

ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతున్నాం



ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతుభరోసా పథకంతో అందరికి లబ్ధి చేకూరింది. నివేశన స్థలాలు లేని 141మందికి స్థలాలు ఇచ్చాం. ప్రభుత్వ పథకాలన్నీ అందరికి అందిస్తున్నాం.

– బోగిరి ప్రసాద్, సర్పంచి

ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



బాపట్ల: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశం హాల్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవడం బాధ్యతగా గుర్తించాలని కోరారు. ఎన్నికల జరిగే రోజు ఓటు హక్కును వినియోగించుకో లేకపోతే పాలకులను ప్రశ్నించే హక్కు ఉండదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎక్కువ సార్లు ఓటు హక్కును వినియోగించుకున్న సీనియర్ సిటిజన్స్‌ను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ,జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు సన్మానించారు. జిల్లాలో కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లు కు ఈపీకే కార్డులను పంపిణీ చేశారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, ముగ్గులు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ సుశీల పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1,600, గరిష్ఠ ధర రూ.2,400, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.

ఉత్సాహంగా సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రారంభం



కలెక్టర్ హిట్ : బ్యాటింగ్ చేసి సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రారంభిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



'ఆట'హాసం: క్రీడాకారులతో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సాక్షి మంగళగిరి బ్రాంచ్ మేనేజర్ గోపి, వీవీఐటీ కళాశాల చైర్మన్ విద్యాసాగర్‌రావు, కిట్స్ కళాశాల చైర్మన్ సుబ్బారావు తదితరులు

- బ్యాటింగ్ చేసి ఆరంభించిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- కలెక్టర్‌కు బౌలింగ్ చేసిన కిట్స్ చైర్మన్ సుబ్బారావు
- తొలిరోజు మూడు మ్యాచ్‌ల షెడ్యూల్

ప్రత్తిపాడు: 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏపీ, తెలంగాణల్లోని ఔత్సాహిక క్రికెటర్లను ప్రోత్సహించేందుకు సాక్షి మీడియా గ్రూపు సాక్షి క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహిస్తోంది. ఈ లీగ్‌ను గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఆయనకు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కె.సుబ్బారావు బౌలింగ్ చేశారు. అనంతరం జట్లను కలెక్టర్ పరిచయం చేసుకున్నారు. తర్వాత టాస్ వేసి తొలిమ్యాచ్‌ను ఆరంభించారు. ప్రీమియర్ లీగ్‌కు స్పాన్సర్లుగా ఏపీఎండీసీ, వివా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఉన్నారు.

దేశంలోనే అత్యధికులు ఇష్టపడే ఆట



దేశంలోనే అత్యధికులు ఇష్టపడే ఆట క్రికెట్ అని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. ఈ క్రీడకు సరైన వేదికలు, మెరుగైన అవకాశాలు అందుబాటులో ఉండవని, అందుకే ఆ బాధ్యతను సాక్షి మీడియా గ్రూప్ తీసుకుని టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరగనున్న పోటీల్లో జిల్లా స్థాయిలో అనేక మంది ఔత్సాహికులు పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. ఇక్కడ గెలుపొందిన టీంలు రీజినల్, స్టేట్ లెవల్లో ఆడనున్నాయని చెప్పారు. సాక్షి నాలుగోసారి ఈ టోర్నమెంట్ నిర్వహిస్తోందని, యువతకు అమితంగా ఇష్టమైన ఈ ఆటకు సాక్షి అవకాశం కల్పించడం ఆనందించదగిన విషయమన్నారు.

యువ ప్రతిభను వెలికితీసేందుకే..



వీవీఐటీ విద్యాసంస్థల చైర్మన్ వి.విద్యాసాగర్ మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టోర్నమెంట్ దోహదపడుతుందన్నారు. సాక్షి మీడియా నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో భాగస్వాములం కావడం ఆనందంగా ఉందన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ యువత రాణించాలని ఆకాంక్షించారు.

ఆహ్వానించదగిన టోర్నీ



కిట్స్ కళాశాల చైర్మన్ కె.సుబ్బారావు మాట్లాడుతూ సాక్షి ప్రీమియర్ లీగ్‌ను తమ కళాశాలలో నిర్వహించడం ఆహ్వానించదగిన విషయమన్నారు.



ఇరు జట్లు పోటీ దృశ్యం

సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సాక్షి క్రమం తప్పకుండా టోర్నమెంట్‌లతో యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచి మేనేజర్ టి.గోపి పాల్గొన్నారు.

తొలి రోజు మూడు మ్యాచ్‌లు షెడ్యూల్‌లో ఉండగా, మొదటి మ్యాచ్‌లో వీవీఐటీ కళాశాల, రెండో మ్యాచ్‌లో విజ్ఞాన్ యూనివర్సిటీ టైగా నిలిచాయి.

టీజేపీఎస్ జయకేతనం



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన కె.శామ్యూల్

మూడో మ్యాచ్ ఎస్‌వీఆర్‌ఎం, రేపల్లె వర్సెస్ టీజేపీఎస్ కళాశాల గుంటూరు జట్ల మధ్య జరిగింది. ఎస్‌వీఆర్‌ఎం కళాశాల టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీజేపీఎస్ కళాశాల 10 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో భారీ విజయం కైవసం చేసుకుంది. 27 బంతుల్లో 48 పరుగులు (రెండు సిక్స్‌లు, ఐదు ఫోర్లు) చేసిన కె.శామ్యూల్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.



విజేతగా నిలిచిన టీజేపీఎస్ కళాశాల టీం

'హరికథా కళారవ'

కోట సచ్చిదానంద శాస్త్రి

- పద్మశ్రీ అవార్డు ప్రకటనతో సర్వత్రా హర్షం
- వేదవిద్యాభ్యానం బ్రాహ్మణకోడూరులోనే..
- గుంటూరులో స్థిరపడిన భాగవతార్



తెనాలి: హరికథ.. సర్వకళల సమాహార కళాప్రక్రియ. నృత్యం, సాహిత్యం, అభినయంలో ప్రవేశముంటేనే రాణించడం సాధ్యం. ఇంతటి విశిష్ట కళలో తెలుగునాట ప్రసిద్ధి చెందిన హరికథకుడు కోట సచ్చిదానందశాస్త్రి భాగవతార్. ఆయన ఏడు దశాబ్దాలుగా దేశవిదేశాల్లో వేలాది ప్రదర్శనలిచ్చారు. అనేక గౌరవాలను పొందారు. శతాధిక కథా వారసులను తీర్చిదిద్దారు. వయసు ఎనిమిది పదులు పైబడినా ఇప్పటికీ గంటల తరబడి కథాగానం చేస్తున్న ఆయన అంకితభావం అనితర సాధ్యం. ఇన్ని ప్రత్యేకతలతోనే 2019లో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం, 2023 పద్మశ్రీ అవార్డు వరించింది.

ఇదీ నేపథ్యం..

సచ్చిదానంద శాస్త్రి స్వస్థలం ప్రకాశం జిల్లా అద్దంకి. తలిదండ్రులు వెంకట శివయ్య, సుబ్బమ్మ. పురోహితుడైన తండ్రి దగ్గరే శాస్త్రి చిన్నతనంలో వేదవిద్య అభ్యసించారు. 9వ ఏటనే ఉపనయనం చేశారు. బ్రాహ్మణకోడూరులోని మధూకర వృత్తితో పమిడిమర్రు సుబ్బావధానులు దగ్గర వేదవిద్య నేర్చారు. 14 ఏళ్ల వయసులో తండ్రి మరణంతో ఐదుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగబిడ్డల్లో పెద్దవాడైన సచ్చిదానందశాస్త్రికి కుటుంబ బాధ్యతలు అనివార్యమయ్యాయి. బంధువర్గంలో కళాకారులు, హరికథకులు ఉండటంతో సహజంగానే ఆసక్తి కలిగిన శాస్త్రి ఓపక్క పౌరోహిత్యం చేస్తూనే, పరిమి సుబ్రహ్మణ్య భాగవతుల రచనలు చదివి స్వయంగా కథాగానం సాధన చేశారు. తర్వాత అదే జీవనాధారమైంది. విజయవాడలో ఓగిరాల గోపాలం, తణుకులో మునునూరు సూర్యనారాయణమూర్తి భాగవతులు, తెనాలిలో భాగవతుల అన్నపూర్ణయ్య దగ్గర తన కథాగానాన్ని మెరుగుపర్చుకుంటూ, ప్రదర్శనలిస్తూ వచ్చారు. విజయనగరంలో ఏడేళ్లపాటు ఉండి ఆంధ్ర, ఒడిశా పరిసరాల్లో కథాగానం చేశారు. 56 ఏళ్ల క్రితం గుంటూరు చేరుకుని అక్కడే స్థిరపడ్డారు.

హరికథకు సరికొత్త సొబగులు

సచ్చిదానంద శాస్త్రి హరికథకు సరికొత్త సొబగులద్దారు. ముందుగా చతురోక్తులు, సరస సంభాషణలతో హరికథను ఆరంభించడం, సందర్భానుసారం భక్తిరస సినిమా పాటలు, సున్నితమైన హాస్య సంభాషణలు చొప్పించడం సచ్చిదానంద శాస్త్రి ప్రత్యేకత. అందుకే ఆయనకు విపరీతమైన డిమాండ్ ఉండేది. కొన్నేళ్లపాటు నెలలో 30 రోజులూ ఆయన డైరీ ఖాళీ ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు.

పద్మశ్రీ అదృష్టమే

హరికథ, బుర్రకథ మనవైన కళలు. వీటిని పరిరక్షించాలి. దీనికి ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం. 'ఆదిభట్ల'తో సహా ఏ ఒక్క హరికథకుడికీ పద్మశ్రీ అవార్డు రాలేదు. ఈ రోజు అది నాకు దక్కడం అదృష్టం. ప్రతి దేవస్థానంలో ఒక హరికథకుడిని నియమించడం, సంప్రదాయ కళారూపాల కోసం విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తే కళలు పదికాలాల పాటు పదిలంగా ఉంటాయి.

– కోట సచ్చిదానంద శాస్త్రి

ఆకాశవాణిలో టాప్ ఏ గ్రేడ్ కళాకారుడు

సచ్చిదానంద ఆకాశవాణిలో టాప్ ఏ గ్రేడ్ ఆర్టిస్ట్. దేశంలోని ముఖ్య పట్టణాలు, పుణ్యక్షేత్రాలతోపాటు లండన్, మారిషస్ విదేశీ ప్రాంతాల్లోనూ ప్రదర్శనలిచ్చారు. కంచిలోని పరమాచార్యులు చంద్రశేఖర సరస్వతి, శృంగేరీ పీఠాధిపతి, త్రిదండి చినజీయరు స్వామి, కుర్తాళం పీఠాధిపతుల సమక్షంలో కథాగానం చేశారు.

కీర్తికిరీటంలో బిరుదులెన్నో..

సచ్చిదానంద శాస్త్రికి కోట్ల విజయభాస్కరరెడ్డి వీణను బహూకరిస్తే, ఎస్పీ బాలు చేతులమీదుగా అభిమానులు స్వర్ణకంకణం తొడిగారు. రాష్ట్ర ప్రభుత్వం 'కళారత్న'తో గౌరవించింది. 'హరికథా సామ్రాజ్య సార్వభౌమ', 'కథాగాన కళాకోవిద', హరికథాగాన కళారవ'వంటి బిరుదులెన్నో ఆయన కీర్తికిరీటంలో చేరాయి. ఇటీవల విజయనగరం మహారాజా కళాశాల శతజయంత్యుత్సవాల్లో హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాసు పురస్కారంతో సచ్చిదానందశాస్త్రిని సత్కరించారు.

కోట హరికథాగాన కళాపీఠం..

హరికథా త్రిమూర్తులుగా పేరొందిన ఆదిభట్ల నారాయణదాసు, పెద్దింటి సూర్యనారాయణ దీక్షిత్, పరిమి సుబ్రహ్మణ్యం భాగవతులు ఆరాధన ఉత్సవాలను గత 25 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు సచ్చిదానందశాస్త్రి. కోట హరికథాగాన కళాపీఠం పేరుతో ఈ ఉత్సవాలు జరుపుతున్నారు. వచ్చే ఏడాది సూర్యనారాయణ దీక్షిత్ స్వస్థలం నరసాపురంలో నిర్వహించాలని తలపోస్తున్నట్లు సచ్చిదానందశాస్త్రి చెప్పారు.

తెనాలిలో ఏసీబీ తనిఖీలు


టౌన్ ప్లానింగ్ విభాగంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీలు కలకలం రేపాయి. అధికారులు, సిబ్బంది మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగాలలో సోదాలు చేసి రికార్డులు పరిశీలించారు. ఏసీబీ డీఎస్పీ టీవీవీ ప్రతాప్ కుమార్ కథనం ప్రకారం.. తెనాలి పురపాలక సంఘ కార్యాలయానికి మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ కుమార్ నేతృత్వంలోని బృందం ఆకస్మికంగా తనిఖీలు చేసింది. వారు నేరుగా కార్యాలయంలోని రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలకు వెళ్ళి సోదాలు చేపట్టారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ జెడ్.సుధాకర్ వద్ద రూ.4,500 నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రెండు బృందాలుగా విడిపోయి రెండు విభాగాలలో ఉద్యోగులు, అధికారులను తనిఖీలు చేశారు. ఉద్యోగుల వద్ద రూ.వెయ్యి మించి ఉండరాదని నిబంధన ఉందని, అందరూ దానిని పాటించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న భవనాలు, సర్వేకు సంబంధించిన స్థలాలు పరిశీలించారు. ఇంకా సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. డీఎస్పీ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ తెనాలి మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలపై మూడు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వాటిలో అనధికారిక కట్టడాలు, ప్లాన్ తీసుకున్న దానికి అనుగుణంగా కాకుండా అదనంగా ఫ్లోర్‌లు నిర్మిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. అలాగే 30 రోజుల్లో సర్వే చేయాల్సి ఉండగా వాటిని చేయకుండా ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉంచుతున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. వీటన్నిటిపై విచారణ జరుపుతున్నామని వెల్లడించారు. రికార్డుల పరిశీలన పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని వివరించారు. ఏసీబీ సీఐలు మన్మదరావు, సురేష్, అంజిబాబు, రవిబాబు, నాగరాజు, ఎస్ఐ శ్రీనివాసమూర్తి ఉన్నారు.

ఉత్సాహంగా సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రారంభం

- ఆరంభించిన పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- తొలిరోజు మూడు మ్యాచ్‌ల నిర్వహణ
- హోరాహోరీగా తలపడిన జట్లు

Regional sponsor — District sponsor

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జేఎన్‌టీయూకే పాలకమండలి సభ్యుడు మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ శరీరాన్ని మనస్సుతో సమన్వయం చేసుకుని ఏకాగ్రత సాధించేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు.క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను సమా నంగా తీసుకుంటేనే జీవితంలో ఎదుగుతారని సూచించారు. తొలి రోజు మూడు మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శ్రీనివాసకుమార్, ఎన్ఐటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరికృష్ణప్రసాదు, నిప్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సురేష్‌కుమార్, డీఎస్పీ విజయభాస్కరరావు, రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఎల్.కృష్ణారెడ్డి, నిట్ కళాశాల పీడీ రాజేంద్రబాబు పాల్గొన్నారు. ఎంపైర్లుగా పి.అజయ్, జె.కోటేశ్వరరావు, కె.నవీన్‌రెడ్డి వ్యవహరించారు.


టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

తొలి బోణి ఎన్‌వీఆర్ సాయితిరుమలదే


విజేత సాయితిరుమల జట్టు, (ఇన్‌సెట్‌లో) సాయికుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

సాక్షి ప్రీమియర్ లీగ్ మొదటి మ్యాచ్‌లో ఎన్‌వీఆర్ సాయితిరుమల ఇంజినీరింగ్ కళాశాల జట్టు 22 పరుగుల తేడాతో నలందా ఫార్మాస్యూటికల్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన నలందా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 101 పరుగులు చేసింది. జె.సాయికుమార్ 35 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నలందా జట్టు జట్టు నిర్ణీత పది ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 79 పరుగులు మాత్రమే చేయగలిగింది. సాయి తిరుమల జట్టు బ్యాట్స్‌మెన్ సాయికుమార్‌కు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ లభించింది.

ఆర్‌వీఆర్‌అండ్‌జేసీ.. చేజింగ్ చేసి..


ఆర్‌వీఆర్ కళాశాల జట్టు, (ఇన్‌సెట్‌లో) శివాజీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

రెండో మ్యాచ్‌లో ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల జట్టు ఆరువికెట్ల తేడాతో నిప్స్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఆర్‌వీఆర్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన నిప్స్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌వీఆర్ జట్టు 8.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని శివాజీ 28 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కించుకున్నాడు.

తిరుమల.. జయమాల


తిరుమల కళాశాల జట్టు, (ఇన్‌సెట్‌లో) ప్రియతమ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

మూడో మ్యాచ్‌లో తిరుమల ఇంజినీరింగ్ కళాశాల జట్టు 21 పరుగుల తేడాతో ఎస్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. ఎస్ఆర్ఐ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన తిరుమల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 96 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్ఐ జట్టు పది ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 75 పరుగులు మాత్రమే చేసింది. తిరుమల జట్టులో 19 పరుగులతోపాటు రెండు వికెట్లు తీసిన ప్రియతమ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

పశు వైద్యానికి పెద్దపీట

- నియోజకవర్గానికి ఒక వ్యాధి నిర్ధారణ కేంద్రం
- లక్ష్యాలకు మించి పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు
- సత్ఫలితాలనిస్తున్న వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ
- ఒక్క ఫోన్ కాల్‌తో గ్రామాలకు వెళ్తున్న పశువైద్య సిబ్బంది


పశువులకు అత్యవసర వైద్యసేవలు అందిస్తున్న వైద్యసిబ్బంది

బాపట్ల టౌన్: రాష్ట్రంలో పాడి పరిశ్రమను ప్రోత్సహించడంతో పాటు రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం పశుఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను డాక్టర్ వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పశువులకు వచ్చిన వ్యాధులను త్వరితగతిన నిర్ధారించి చికిత్స అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ల్యాబ్‌లో ఒక గదిని ప్రత్యే కంగా పరీక్షలకు కేటాయించారు. ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ల్యాబ్ అంటెండర్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్నారు.
జిల్లాలో నియోజకవర్గాని ఒక డాక్టర్ వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు జిల్లాలో బాపట్ల, వేమూరు, రేపల్లె, చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లో పేడ పరీక్ష, రక్త పరీక్ష, నాసికసారాల పరీక్ష, బాహ్యపరాన్నజీవుల పరీక్ష, పొదుగు వ్యాధికి పాల పరీక్ష, జీవరసాయన(గ్లూకోజ్, కాల్షియం, లివర్) పరీక్షలను చేస్తున్నారు. పశువులకు ఏదైనా సమస్య వస్తే వెంటనే ల్యాబ్ టెక్నీషియన్లు పరీక్షలు నిర్వహించి ఏ సమస్య వలన పశువు అనారోగ్యం బారిన పడిందో గుర్తించి వెంటనే మందులను అందజేస్తున్నారు.

నియోజక వర్గం	వాహనం తిరిగిన గ్రామాలు	సాధారణ వైద్యసేవలు	అత్యవసర వైద్యసేవలు	లబ్ధి పొందిన రైతులు
చీరాల	709	1346	910	2208
రేపల్లె	324	620	596	1016
అద్దంకి	254	614	402	1018
పర్చూరు	423	820	276	998
బాపట్ల	325	940	388	951
వేమూరు	511	597	319	885
మొత్తం	2546	4937	2891	7076

సత్ఫలితాలిస్తున్న సంచార వైద్య సేవలు..
మూగజీవాల వైద్యానికి అధికప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం ప్రత్యేకంగా 1962 టోల్ ఫ్రీ నంబర్ ఉన్న డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను ఈ ఏడాది మే 19న అందుబాటులోకి తీసుకొచ్చింది. అంబులెన్స్‌లను ఏర్పాటుచేసి పశువులకు తక్షణమే వైద్యసేవలు అందిస్తున్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒక మొబైల్ అంబులేటరీ వెటర్నరీ క్లినిక్(ఎంఏవీసీ) వాహనాన్ని ప్రభుత్వం సమకూర్చింది. వాహనంలో ప్రాణాంతకమైన వ్యాధులకు గురైన పశువులకు సత్వర వైద్యం అందించేందుకు మందులు, వ్యాక్సిన్లు భద్ర పరిచేందుకు ప్రత్యేకంగా ఫ్రీజర్ బాక్సులు అమర్చారు.
7828 పశువులకు సంచార వైద్యసేవలు..
డాక్టర్ వైఎస్సార్ సంచార సేవ వాహనాలను ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటికీ జిల్లాలో 7828 పశువులకు వైద్యసేవలు అందించారు. వీటిల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 2891 పశువులను కాపాడారు.

లక్ష్యాలకు మించి ల్యాబ్ పరీక్షలు
బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలల్లో మొత్తం 5343 పరీక్షలు చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్ధారించగా ఇప్పటికీ 12375 పరీక్షలు నిర్వహించి 232 శాతం నమోదుచేశారు.

నియోజక వర్గం పేరు	లక్ష్యం	చేసినవి	శాతం
చీరాల	1089	2245	206
రేపల్లె	836	2096	251
అద్దంకి	1029	2910	283
పర్చూరు	772	1684	218
బాపట్ల	815	1667	205
వేమూరు	802	1773	221
మొత్తం	5343	12375	232

అందుబాటులో అత్యవసర వైద్యం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ పథకం పశుపోషకుల పాలిట సంజీవినిలా పనిచేస్తోంది. మూగజీవాలు అనారోగ్యం బారిన పడ్డాయని 1962కు కాలు చేస్తే అక్కడకు వాహనం చేరుకుంటుంది. ఇప్పటికీ జిల్లాలో సంచార పశు ఆరోగ్యసేవ వాహనం 4937 సాధారణ వైద్యసేవలందించింది, ప్రాణాపాయంతో ఉన్న 2891 పశువులను కాపాడారు.


– డాక్టర్ ఎం.హనుమంతరావు, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి

అరసం 19వ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ


అరసం రాష్ట్ర మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి

తెనాలి: తెలుగునాట సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదపడిన అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు, ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి కోరారు. ఫిబ్రవరి 11, 12 తేదీల్లో స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో జరగనున్న మహాసభల లోగోను బుధవారం ఆయన ఆవిష్కరించారు. అరసం ఆధ్వర్యంలో పాఠశాలలు, కాలేజీల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలను ప్రకటించారు. పాఠశాలల విద్యార్థులకు జరిపిన కథ చెప్పండి అనే అంశంలో పోటీల్లో ఎస్.నందిని ప్రథమ బహుమతిని దక్కించుకోగా, సీహెచ్ మౌనిక ద్వితీయ బహుమతి, ప్రిస్కిల్లారాణి తృతీయ బహుమతిని గెలుపొందినట్లు తెలిపారు. వ్యాసరచన పోటీలో ఎం.అక్షయ, ఎం.ప్రశాంతి, గ్లోరి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారు. వక్తృత్వ పోటీల్లో ఎం.చైతన్య, కె.అను, ఎం.భాగ్యలక్ష్మి ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులను కై వసం చేసుకున్నారు. కాలేజీల విభాగంలో జరిపిన వ్యాసరచన పోటీల్లో ఎ.రూపనందశ్రీనాథ్ ప్రథమ, బి.భవాని లక్ష్మి ద్వితీయ, షేక్ పాయిజ తృతీయ బహుమతిని సాధించారు. వక్తృత్వ పోటీల్లో ఎం.చంద్రశేఖర్, సయ్యద్ అమానుల్లాకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి. లోగో ఆవిష్కరణలో అరసం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, ఆహ్వాన సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, షేక్ అబ్దుల్ హకీంజాని, టి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 2.10 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ. 2.10 కోట్ల నగదు కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను బుధవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 16 రోజులకు గాను 38 హుండీల ద్వారా రూ. 2,10,31,198ల నగదుతో పాటు 393 గ్రాముల బంగారం, 4.834 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. ఇక ఈ-హుండీ ద్వారా రూ. 70,593 విరాళాలు దేవస్థానానికి భక్తులు సమర్పించారన్నారు. కానుకల లెక్కింపులో సేవా సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఆర్థిక వ్యవస్థలో మార్పు

- నిధులు కేటాయింపులో ప్రాధాన్యం
- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు

బాపట్ల అర్బన్: విద్యతోనే ఆర్థిక వ్యవస్థ, ఎస్టీల జీవితాల్లో మార్పు సాధ్యమని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు పేర్కొన్నారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని బుధవారం పరిశీలించారు. విద్యార్థినుల సమస్యలపై చర్చించారు. 323 సీట్ల సామర్థ్యం ఉన్న వసతి గృహంలో కేవలం 125 మంది ఉండడంపై ఆరా తీశారు. వసతిగృహ నిర్వహణపై సంబంధిత అధికారులను వివరాలు అడగ్గా సమాచారం లేదనడం, దస్త్రాలు అందుబాటులో లేవని చెప్పడంపై సహనం వ్యక్తం చేశారు. విద్యార్థినులు ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోవడంతో విస్మయం వ్యక్తం చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అల్పాహారం, భోజనం మెనూ చార్టు లేకపోవడంపై సిబ్బందిని మందలించారు.
ఇన్‌చార్జి హెచ్‌డబ్ల్యూఓపై ఫిర్యాదు
ఇన్‌చార్జి వసతి గృహ సంక్షేమ అధికారి(వార్డెన్)గా నాలుగో తరగతి ఉద్యోగి డి.ధనలక్ష్మిని నియమించడంపై డీటీడబ్ల్యూఓను ప్రశ్నించారు. అక్కడే నుంచే రాష్ట్ర ఉన్నతాధికారులతో చైర్మన్ ఫోనులో మాట్లాడి ఆమెను తొలగించి హెచ్‌డబ్ల్యూఓను నియమించాలని సూచించారు. గిరిజన వసతిగృహాలలో విద్యాప్రమాణాలు దిగజారడానికి అధికారుల పర్యవేక్షణ లోపమని అభిప్రాయపడ్డారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ విశ్వవిద్యాలయాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి విదేశీ విద్యను ఉచితంగా అందిస్తోందని చెప్పారు. ఇందుకోసం ఒక్కొక్క విద్యార్థికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చు చేయడానికి ప్రభుత్వం వెనుకాడటం లేదని వివరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి షేక్ సైదాదస్తగిరి, బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1,08,337 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,08,337 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,04,448 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 65,158 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.